క్లుప్తంగా

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కడప వైఎస్సార్ సర్కిల్: వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో స్మార్ట్ మీటర్ల రద్దు కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు వామపక్ష కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్ తెలిపారు. శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెరవేసే టైం ఆఫ్ డే టార్ఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమని విమర్శించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ రామ్మోహన్, ఏఐటీయూ నగర అధ్యక్షులు మద్దిలేటి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఎస్ఎఫ్ఐ నగర కమిటీ

కడప వైఎస్సార్ సర్కిల్: ఎస్ఎఫ్ఐ నూతన నగర కమిటీని ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నగర ఎస్ఎఫ్ఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నామన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలన్నారు. విద్యార్థులకు ఉన్నత వి ద్య అవకాశాలు పెంచాల న్నారు. అనంతరం కడప నగర నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సుమంత్, మోహన్‌ని, నగర ఉపాధ్యక్షులుగా అఖిలేష్, శ్రీను, రోహిత్ ఆదిత్య, కార్యదర్శులుగా నవీన్, అద్భుత్, కార్తిక్, నరసింహ, నగర కమిటీ సభ్యులుగా మనోహర్, శివ, సాయి, సాగర్, మొత్తం 14 మంది సభ్యులతో నగర కమిటీ ఎన్నుకున్నామన్నారు.

ప్రధాని మోడీ మౌనం వీడాలి

కడప వైఎస్సార్ సర్కిల్: భారతదేశం పై తీవ్ర స్థాయిలో అణచివేత చర్యలు తీసుకుంటూ వాటిని అమలు చేస్తున్నట్లు బహిరంగంగా దేశంపై ముప్పేట దాడుల తరహాలో ప్రకటనలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పై పిరికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనం వహించి చరిత్ర హీనుడయ్యాడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూగుల్ మైక్రో సాఫ్ట్ వంటి ఐటి దిగ్గజ కంపెనీలలో భారతీయులను ఉద్యోగులుగా తీసుకోరాదు అన్న డోనాల్డ్ ట్రంప్ తాజా హెచ్చరికలు భారతదేశాన్ని కుదిపేస్తున్నప్పటికీ ప్రధాని నోరు మెదపకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

జిల్లాలో ఎరువుల కొరత తీర్చకపోతే ఆందోళన



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్సార్ సర్కిల్: జిల్లాలో నెలకొన్న ఎరువుల కొరతను తక్షణం తీర్చకపోతే ఆందోళన తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాలో 77,475 హెక్టార్లు పంటల సాధారణ సాగు విస్తీర్ణంగా అంచనా గట్టి సీజనంతటికి 69 వేల 600 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని జిల్లా అధికారుల విన్నపాన్ని రాష్ట్ర ప్రభుత్వం 40390 మెట్రిక్ టన్నులు కేటాయించిందన్నారు. అయితే ఈ నాలుగు మాసాల కాలంలో కేవలం 7146 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చిందన్నారు. పూర్తిస్థాయిలో ఎరువులు ఇవ్వాలన్నారు. ఎరువులపై ధరలు మాత్రం ఇబ్బడి ముబ్బడిగా పెంచుతున్న కంపెనీలపై నియంత్రణ చేయడానికి చేతగాని ప్రభుత్వం రైతులకు ఇచ్చే రాయితీలో మాత్రం పట్టుబట్టి కోత విధిస్తోందన్నారు. ఇది ఎంత మాత్రం తగదన్నారు. ఎరువుల కొరతను తీర్చి ప్రాధాన్యత క్రమంలో ఆర్బీకేలు సొసైటీలకు ఎక్కువ భాగం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించే డీలర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు.

గర్భిణీలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలి

– జేసీ అదితిసింగ్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : గర్భిణీలపై ప్రత్యేక పర్యవేక్షణతోపాటు వైద్యులు, ఐసీడీఎస్ సిబ్బంది అంకిత భావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించినపుడే ప్రసూతి సమయంలో మాతృ మరణాలను అరికట్టగలమని జేసీ అదితిసింగ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రసూతి మరణాల విచారణ (డీఎండీస్)కమిటీ సమీక్ష సమావేశం జేసీ అదితిసింగ్ అధ్యక్షతన జరిగింది. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ప్రసూతి మరణాల రేటును జీరో శాతానికి తీసుకువచ్చేందుకు వైద్యాధికారులు, అంగన్వాడీ, ఆరోగ్యకార్యకర్తలు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా అంకిత భావంతో పని చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో 2025 జనవరి నుండి మార్చి మాసం వరకు సంభవించిన 3 ప్రసూతి మరణాలకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు, సంబంధిత పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల వైద్యాధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లతో విచారణ నిర్వహించారు. మాతృ మరణాలకు సంఘటనల వివరాలను, కారణాలను తెలుసుకున్నారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో వైద్యాధికారులు క్రమం తప్పకుండా వారి పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో నమోదయిన గర్భవతులు, బాలింతల వివరాలను తెలుసుకోవాలన్నారు. గర్భిణీల ఆరోగ్యం పట్ల మెడికల్ ఆఫీసర్, అంగన్వాడీ సూపర్ వైజర్లు నిరంతరం అప్రమత్తంగా మెలగాలన్నారు. వారి ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత ఆరోగ్య కార్యకర్తలతో, ఐసీడీఎస్ సిబ్బందితో వైద్యాధికారులు సమీక్షించాలన్నారు.

బాలింతలు, గర్భవతులకు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎప్పుడు ఎలాంటి వాక్సిన్ వేయించుకోవాలన్న విషయాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. వైఎస్ఆర్ కడప జిల్లాను మాతృ మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. సీడీపీవోలు తరచూ తప్పకుండా సూపర్వైజర్‌లతో, అలాగే.. పీడీ ..సీడీపీవోలతో సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, సంబంధిత వైద్యాధికారులు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పర్యటన జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 27న బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తొలిసారిగా కడప పర్యటనకు రానున్న తరుణంలో పార్టీ శ్రేణులు ఆయన పర్యటన జయప్రదం చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో కడప వై జంక్షన్ నుంచి ఆదిత్య కల్యాణమండపం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. తిరుమల తొలి కడప దేవుని కడప నుంచి నూతన రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తొలి పర్యటన పెట్టుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో బీజేవైఎం జాతీయ నాయకులు పవన్, బీజేవైఎం నాయకులు సురేంద్ర, అశోక్ కుమార్ రెడ్డి, పృథ్వి నారాయణ, దశరథ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం


యాంటి డ్రగ్స్ పోస్టర్స్‌ను విద్యార్థులతో కలిసి విడుదల చేస్తున్న ఈగల్ అధికారులు

కడప ఎడ్యుకేషన్: మత్తు పదార్థాల వల్ల విద్యార్థులు తమ భవిషత్తును అంధకారం చేసుకోవద్దని ఈగల్ టీం అధికారులు సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం కడప గాంధీ నగర్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ।ఈగల్₹ టీం ఆధ్వర్యంలో యాంటి డ్రగ్స్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించాను. ఈ సందర్భంగా ఈగల్‌టీమ్ అధికారులు మాట్లాడుతూ కొందరు మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకుంటున్నారన్నారు. పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు హత్యలకు సైతం పాల్పడుతూ మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మీరు నివసించే చుట్టుపక్కల ప్రాంతాలలో ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడ్డట్లు గుర్తించినా లేదా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగమణి పాల్గొన్నారు.

శక్తి యాప్ మహిళలకు భద్రత


శక్తియాప్‌ను తమ సెల్‌ఫోన్‌లలో చూపిస్తున్న బాలికలు

కడప ఎడ్యుకేషన్: శక్తి యాప్ మహిళలకు భద్రత కల్పిస్తుందని తాలుకా ఎస్ఐ తాహీర్ హుస్సేన్ పేర్కొన్నారు. కడప మరియాపురం సాంఘీక సంక్షేమ బాలికల హాస్టల్‌లో శక్తి యాప్‌పై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేయించి పిల్లలకు యాప్ గురించి అవగాహన కల్పించారు.

టెండర్ వేసిన వారికే గదులు కేటాయించాలి


మాట్లాడుతున్న దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో టెండర్లు వేసి ఆరు నెలలు అవుతున్నా దళిత మహిళ స్రవంతికి గదులు చూపెట్టకుండా ఆర్టీసీ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనిని నిరసిస్తూ శుక్రవారం కడప కలెక్టరేట్ ఏదుట దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు మాతంగి సుబ్బరాయుడు, సగిలి గుర్రప్ప, ఆంజనేయులు తదితరులు మాట్లాడుతూ కడప ఆర్టీసీ బస్టాండులో గత ఆరు నెలల కిందట టెండర్లు వేసిన వారికి ఇంతవరకు గదులు చూపెట్టలేదని ఆర్టీసీ ఆర్ఎం, ఈడీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు తెలిపారు. గదుల విషయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు పేద బడుగు బలహీన వర్గాలకు తగిన న్యాయం చేయాలని కోరుతున్నామని తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు మునెయ్య, ఓబులేసు ప్రసాదు, బీసీ గంగులుతోపాటు బాధితురాలు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వాల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న తాలుకా ఎస్ఐ తులసీ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుండే క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కడప తాలూకా ఎస్.ఐ తులసి నాగప్రసాద్ సూచించారు. శుక్రవారం నగరంలోని రామరాజుపల్లిలోని పరమేశ్వర హైస్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. బాగా చదువుకుని సమాజానికి, దేశానికి సేవ చేయాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశల్ని, ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. దేశ భవిష్యత్తు విద్యార్థులు, యువతపై ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకుని నడుచుకోవాలని సూచించారు. అనంతరం పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్ – 112, రహదారి భద్రత, సోషల్ మీడియా – సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు


మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతున్న మానవత సంస్థ సభ్యులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప పట్టణ మానవతా సంస్థ ఆత్మీయ సహకార కమిటీ సభ్యులు .. నిర్మల హాస్పిటల్‌లో మరణించిన చంద్రమ్మ అనే 80 సంవత్సరాల వృద్ధురాలికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. చంద్రమ్మ మృతి సమాచారం అందుకున్న మానవత సంస్థ సభ్యులు రామకృష్ణ జూనియర్ కళాశాల వద్దగల మోచంపేట స్మశాన వాటికలో ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో సాయి విజ్ఞాన్ కళాశాల డైరెక్టర్ భూపతి రాయల్, సమ్మెట సత్యనారాయణ, డాక్టర్ సెల్వం ఆచారి, ఓబులేసు, శివ, కనకరాజు పాల్గొన్నారు.

వారి ప్రాపకం కోసమే ఇంకా వెనకేసుకొస్తున్నారు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి సందీప్‌రెడ్డి

కడప కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవి తమ ప్రాపకం కోసమే టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్‌ను వెనకేసుకొస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి సందీప్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన అంజద్‌బాషాను ఏక వచనంతో సంభోదిస్తూ, ఛోటా నాయకుడంటూ మాట్లాడటం దారుణమన్నారు. తిరుమలేష్ అహంకారపూరిత ధోరణికి ఇదే నిదర్శనమన్నారు. మాట్లాడే ముందు సభ్యత, సంస్కారం నేర్చుకోవాలని హితవు పలికారు. నిప్పు లేకుండా పొగ రాదన్నట్లు...విద్యాసంస్థల దగ్గర తిరుమలేష్ అక్రమ వసూళ్లు చేశారన్నది వాస్తవమన్నారు. అలా చేయకపోతే నారాయణ విద్యాసంస్థల వారితో శ్రీనివాసులరెడ్డి ఎందుకు మాట్లాడాల్సి వచ్చింది,.... ఏమీ చేయకపోతే తిరుమలేష్ ఎందుకు రాజీనామా ఇచ్చార ని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఆమె భర్త అండతోనే తిరుమలేష్ అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు బైక్‌లో తిరిగే తిరుమలేష్, టీడీపీ అధికారంలోకి రాగానే స్కార్పియోలో తిరుగుతున్నాడని, దీన్నిబట్టే అతని అక్రమ సంపాదనను అర్థం చేసుకోవచ్చన్నారు. టీడీపీ వాళ్లే అతన్ని అసహ్యించుకుంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై మాట్లాడేటప్పుడు నోటిని అదుపులో ఉంచుకోకపోతే తగిన రీతిలో బుద్ధిచెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త, నగర అధ్యక్షుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలి


ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప, పొద్దుటూరు ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలని, అలాగే వారికి వత్తాసు పలుకుతున్నారని ఆర్‌జేడీ వైఖరికి నిరసనగా పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం కడప ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న మాట్లాడుతూ పాఠశాలల పర్యవేక్షణ లేకుండా కార్పోరేట్, ప్రైవేటు ప్లే స్కూళ్లకు అనుమతులు లేక పోయినా అనుమతులను ఇచ్చారని ఇందుకు వారి వద్ద నుంచి మామూళ్లు వసూలు చేశారని ఆరోపించారు. అలాగే గత నెలలో ఉపాధ్యాయుల బదిలీలలో కూడా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయమై డీఈఓ నోటీసులు కూడా జారీ చేశారని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలని అలాగే విద్యాశాఖ ఆర్‌జేడీపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు కార్తీక్, నగర నాయకులు రమణ, వేంకటేసు, సురేష్, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో శ్రావణమాస పూజలు


విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ


సుమంగళి పూజ నిర్వహిస్తున్న భక్తులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గ ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి శ్రావణ శుక్రవారం కావడంతో తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఉదయం 10.00 గంటలకు కుంకుమార్చన (సుమంగళి పూజ) నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. రాత్రి పల్లకీ సేవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆగస్టు 8వ తేదీ శుక్రవారం వరలక్ష్మీవ్రతం, 9న శ్రావణపౌర్ణమి కావడంతో నవకలశ స్నపనం, విశేష చండీహోమం, దీపాలంకార సేవ వంటివి నిర్వహించనున్నారు. 10వ తేదీ ఉదయం 10.00 గంటలకు శ్రీ విజయదుర్గ, మల్లికార్జున స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నామని ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ తెలిపారు.

కడప ఎంఈఓ-1గా రఫిక్ నియామకం

కడప ఎడ్యుకేషన్: కడప మండల ఎంఈఓ–1గా నగరంలోని అంధుల ఉన్నత పాఠశాల గ్రేడ్–2 హెచ్‌ఎంగా పనిచేస్తున్న రఫిక్ అహ్మద్‌ను నియమించారు. ఈ మేరకు పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శామ్యూల్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈయన కడప ఎంఈఓ–1గా నేడో రేపో బాధ్యతలను స్వీకరించనున్నారు. గతంలో కడప ఎంఈఓ–1గా పనిచేస్తున్న గంగిరెడ్డి ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల విషయమై పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అధికారులు ఆయనకు నోటీసులతోపాటు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌ను జారీ చేశారు. దీంతో ఆయన కడప ఎంఈఓ–1 నుంచి తొలగించి ఆయన స్థానంలో కడప అంధుల పాఠశాలలో గ్రేడ్–2 హెచ్‌ఎంగా పనిచేస్తున్న రఫిక్ అహ్మద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గంగిరెడ్డి రెగ్యులర్ ఎంఈఓ స్థానమైన చెన్నూరు వెళ్లనున్నట్లు తెలిసింది.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సత్కరిస్తున్న ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ కోరారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖలో పాలిటెక్నిక్‌లో పనిచేసే టీచింగ్ అకడమిక్ స్టాఫ్ ఉద్యోగులకు ఏఐ సీటీఈ నిబంధనల మేరకు 2016 పే స్కేల్స్‌ను అమలు చేసినా వేతన బకాయిలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న రూ. 191.13 కోట్లు తక్షణమే విడుదల చేయాలని కోరారు. అలాగే మంగళగిరి ఎయిమ్స్‌లో ఈహెచ్ఎస్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సదుపాయం కోసం ఏర్పాటు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం తరుపున మాట్లాడాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, సహ అధ్యక్షులు సుగుణ, ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్, లక్ష్మిపతి, వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు సాంబశివమ్మ, హనుమంతు, జె.సుదర్శన్‌రెడ్డి, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: బదిలీలు పూర్తయి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ఉపాధ్యాయులకు ఇప్పటికి పొజిషన్ ఐడీలు రాకపోవడం, జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు కడప డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. శుక్రవారం కడప యుటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ బదిలీలకు ముందు ప్రభుత్వం ఒక ప్రణాళిక బద్ధంగా వ్యవహరించకపోవడం వల్ల బదిలీ పొందిన ఉపాధ్యాయులు రిలీవ్ కావడంలోనూ, పొజిషన్ ఐడిలు క్రియేట్ చేయడంలోనూ, జీతాలు చెల్లించడంలోనూ తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని తెలిపారు. బ్యాంకులో తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించే పరిస్థితి వచ్చిందని ఆవేదనను వ్యక్తం చేశారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం వలన జీతం మీద ఆధారపడిన ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం సాయంత్రం 4 గంటల నుండి నిరసన ఆందోళన కార్యక్రమం కడప డీఈఓ కార్యాలయం వద్ద చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ నరసింహారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులను పాటించాలి

కమలాపురం : రైతులు వరి పంటలో సమగ్ర ఎరువు యాజమాన్య, సస్యరక్షణ పద్ధతులను పాటించాలని ఏఓ సరస్వతి తెలిపారు. శుక్రవారం మండలంలోని దాదిరెడ్డిపల్లెలో ఇండిక్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. మట్టి పరీక్షల ఆధారంగా సిఫారసు చేసిన ఎరువులను మాత్రమే వాడాలన్నారు. విత్తనశుద్ధి తప్పని సరిగా చేయాలన్నారు. ప్రతి 2 మీటర్లకి 30 సెం.మీ. చొప్పున కాలిబాటలు తీసుకోవాలన్నారు.

జన్యు లోపాలు నిర్ధారించేందుకు ఉచిత స్క్రీనింగ్


రిమ్స్ గైనకాలజీ ఓపి వద్ద ఉమ్మిద్ ప్రాజెక్ట్ బృందంతో జీజీహెచ్ అధికారులు, వైద్య బృందం

కడప అర్బన్: కడప నగర శివార్లోని ప్రభుత్వ వైద్యశాల (రిమ్స్) గైనకాలజీ ఓపీలో జన్యుపరమైన లోపాలు, మెటబాలిక్ రుగ్మతలు నిర్ధారించేందుకు ఉచితంగా స్క్రీనింగ్ చేసేందుకు కృషి ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జీజీహెచ్ (రిమ్స్)సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, సిఎస్ ఆర్ ఎం ఓ డాక్టర్ వై.శ్రీనివాసులు విచ్చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు నగరాలలో మాత్రమే అధిక ఖర్చుతో అందుబాటులో ఉన్న ఈ ఆధునిక వైద్య పరీక్షలు ఇప్పుడు కడపలో జీజీహెచ్ రిమ్స్ లో ఉచితంగా లభిస్తున్నాయన్నారు. జిల్లా ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలో కడప జిల్లానే ఈ ప్రాజెక్ట్‌ను పొందిన ఏకైక జిల్లా కావడం గర్వకారణంగా వుందన్నారు. ఈ బృందంలో ప్రసూతి , గైనకాలజీ విభాగాధిపతిగా డాక్టర్ లక్ష్మీసుశీల, డాక్టర్ రబ్బాని బేగం, డాక్టర్ రేఖారావు, బృందంతో కలిసి, గర్భిణులు, పునరుత్పత్తి వయస్సు గల మహిళలను థలసీమియా, సికిల్ సెల్ వ్యాధుల కోసం స్క్రీన్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమం సెయింట్ జాన్ కళాశాల బెంగళూరు వారి సాహకారంతో జరగనుందన్నారు. చిన్నపిల్లల విభాగం అధిపతిగా డాక్టర్ ప్రసేన్ రెడ్డి, నియోనటాలజిస్ట్ తో కలిసి మెటబాలిక్ రుగ్మతల కొరకు స్క్రీన్ చేస్తారన్నారు. ఉమ్మిద్ ప్రాజెక్ట్ ద్వారా జన్యుపరమైన రుగ్మతలు ముందుగానే గుర్తించి, ఆరోగ్యకరమైన తరం కోసం ముందడుగు వేస్తున్నామని వారు వివరించారు. తదనంతరం ఈ బృందం కడప వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ భాస్కర్‌రెడ్డి, గైనకాలజీ విభాగం వైద్యులను కలిశారు. ప్రాజెక్ట్‌ను గురించి వివరించారు.